మొబైల్ సర్వీస్‌తో ఉచిత వైద్యసేవలు

కాచిగూడ, ఆగస్టు 24 : మొబైల్ సర్వీస్ ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు హ్యుమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. 35 ఏండ్లుగా బీద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు, మందులు అందిస్తున్నామని పేర్కొన్నారు. అత్యధునిక పరికరాలతో షుగర్, బీపీ, థైరాయిడ్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు, నడుము, మెడ, లావు, పొట్ట తగ్గడానికి, నరాలకు సంబంధించిన వ్యాధులు, ఇతర సమస్యలున్నవారికి ఇంటి వద్దనే సేవలను అందించనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99492 38492లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండలోని బీజేఆర్ డిగ్రీ కాలేజ్ నూతన ప్రిన్సిపాల్‌గా నియమితురాలైన శ్రీలక్ష్మి శనివారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. - మెహిదీపట్నం

పార్కుల అభివృద్ధికి సత్వర చర్యలు

చిక్కడపల్లి, ఆగస్టు 24 : పార్కుల అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని దశాబ్ది పార్క్ (ఎంఐజీ- 2 పార్క్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విచ్చేసి పార్క్‌ను ప్రారంభించారు. బాగ్‌లింగంపల్లి ఎంఐజీ - 2 వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.40 లక్షలతో పార్కును అన్నివిధాలుగా అభివృద్ధి చేశామని, నియోజకవర్గం పరిధిలోని అనేక పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేచ్చామన్నారు. ప్రతిఒక్కరూ వ్యాయామానికి సమయం కేటాయించాలని సూచించారు. అన్నిప్రధాన పార్కులో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయించామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాంనగర్ కార్పొరేటర్ రవి చారి, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, చిక్కడపల్లి సీఐ సీతయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బబ్లూ, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, హౌస్ ఫెడ్ డైరెక్టర్ కిషన్ రావు, అరుణోదయ విమలక్క, నాగభూషణం, వివేక్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ రావు, ఉపాధ్యక్షుడు శేషయ్య, శంకర్, రామచంద్రారెడ్డి, జోసెఫ్ పాల్గొన్నారు. పేదలకు వైద్య సేవలను చేరువ చేయాలి

పార్కులో జిమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, ఆగస్టు 24 : ఉచిత వైద్య సేవలను పేదలకు మరింత చేరువ చేయాల్సివ అవసరం ఉన్నదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం ముషీరాబాద్ రేడియంట్ హైస్కూల్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్య సేవలను మరింత విస్తరిస్తూ పేద, బడుగు వర్గాలకు వైద్యం అందించాని కోరారు. కార్యక్రమంలో రేడియంట్ హైస్కూల్ కరస్పాండెంట్ అహ్మద్ భక్తీయారి, బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, మహ్మద్ ఖదీర్ పాల్గొన్నారు.

గార్బేజ్ పాయింట్‌ను తొలగించాలి

చిరాగ్‌అలిలోని మహావీర్ నెస్ట్ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న గార్బేజ్ పాయింట్‌తో కాలనీ వాసులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని పాయింట్‌ను ఎత్తి వేయాలని గన్‌ఫౌండ్రి మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా కోరారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. మమతా సంతోష్ గుప్తా మాట్లాడుతూ.. గార్బేజ్ పాయింట్‌తో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. మేయర్ స్పందించి అక్కడి నుంచి గార్బేజ్ పాయింట్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

- అబిడ్స్

బతుకమ్మకుంట పక్కా పట్టా ల్యాండ్

అంబర్‌పేట, ఆగస్టు 24 : బతుకమ్మకుంట స్థలం పక్కా పట్టా స్థలమని, అందులో ఎలాంటి కుంట లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. బతుకమ్మకుంట స్థలం దగ్గరకు వచ్చి అక్కడ కుంటను పునరుద్ధరించాలని మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆయన బతుకమ్మకుంట స్థలం విషయమై మీడియాతో మాట్లాడారు. అంబర్‌పేట పెద్దలు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు 20 ఏండ్లుగా ఎందుకు ఈ స్థలం వెంటపడుతున్నారో అర్థం కావడంలేదని చెప్పారు. తనకు, స్థల యజమానులకు సంప్రదింపులు నడుస్తున్నాయని, తాను పొజిషన్‌లో ఉన్నానన్నారు. హనుమంతరావు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పిలిచి అక్కడ కుంటను పునరుద్ధరించాలని చెప్పడం అవివేకమన్నారు. తాను హైడ్రా కమిషనర్‌కు పూర్తి వివరాలు అందజేశానని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకుడు జె.డి.రాహుల్ పాల్గొన్నారు.

వివరాలను చూపిస్తున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి

హెచ్చార్సీ కార్యదర్శి గార్గ్ పదవీకాలం పూర్తి

మానవ హక్కుల కమిషన్‌లో కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన డీఆర్ గార్గ్ రెండేండ్ల పదవీకాలం శనివారంతో పూర్తయింది. 2022 నుంచి కార్యదర్శిగా బాధ్యతలను నిర్వహించిన ఆయన పదవీకాలం ముగియడంతో కమిషన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ షాబుద్దీన్, పీఆర్వో శ్రీనివాస్‌రావు, ఇన్‌చార్జి ఏవో స్వరాజ్యలక్ష్మి, టీజీవో, టీఎన్‌జీవో సిబ్బంది శాలువాతో సన్మానించారు.

- సుల్తాన్‌బజార్

ఎస్సీఏ ఉత్తర్వులను అమలుచేయాలి

కాచిగూడ, ఆగస్టు 24 : చాలిచాలని జీతాలతో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న హోంగార్డుల సమస్యల పరిష్కరానికి శాసనమండలిలో ప్రస్తావించి, సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు హోంగార్డు ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మాజీ హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాజీవ్ త్రివేది రూపకల్పన చేసిన ఎస్సీఏ ఉత్తర్వులను అమలుచేయాలని కోరుతూ శనివారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు హోంగార్డు ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. కాచిగూడలో వారు మాట్లాడుతూ.. హోంగార్డుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎస్.నారాయణరెడ్డి, రాజేంద్రప్రసాద్, మోహన్‌నాయక్, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతి పత్రం అందజేస్తున్న హోంగార్డు ప్రతినిధులు

సమాజ్ ప్రతినిధులతో ప్రాణహాని ఉన్నది

అబిడ్స్, ఆగస్టు 24 : తమ సమాజ్ ప్రతినిధులతో తనకు ప్రాణహాని ఉందని ఎస్ఎస్‌కె సమాజ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు నగరి లక్ష్మి నారాయణ్ పేర్కొన్నారు. ఇప్పటికే తనపై పలు మార్లు హత్యాయత్నానికి పాల్పడడంతో పాటు శ్రావణ శుక్రవారం రోజు తనపై సమాజ్ ప్రతినిధులు, సభ్యులు కలిసి దాడి చేయడంతో తీవ్ర భయభ్రాంతులకు లోను చేశారని వాపోయారు. దీంతో తన కాలు ఫ్యాక్చర్ అయ్యిందని, వారు నిధులు గోల్ మాల్ చేశారని, దీంతో ప్రజలు వారిని తిరస్కరించారన్నారు. అది జీర్నించుకోలేక తనపై దాడికి దిగుతున్నారని ఆరోపించారు. దాడి విషయమై మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. త్వరలో నగర పోలీస్ కమిషనర్, డీజీపీలను స్వయంగా కలిసి ఫిర్యాదు చేస్తానన్నారు.

సన్మానం..

చిక్కడపల్లి, ఆగస్టు 24 : ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ బి.సునీల్ కుమార్ నియమితులయ్యారు.బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (ముషీరాబాద్ సర్కిల్) సలహాదారుడు మల్లేశ్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో హాకీ కోచ్ జావీద్, డైనీయల్, టోనీ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల తయారీలో శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ నాగేశ్వర్‌రావు

ముషీరాబాద్ : విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇకోక్లబ్, వృక్షశాస్త్రం విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఇకో ప్రిజర్వేషన్ కార్యశాల నిర్వహించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ బి.నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్వీజ్ పోటీలు నిర్వహించి, మట్టి వినాయక విగ్రహాలు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ప్రభు, క్లబ్ కన్వీనర్ ఎస్.అనురాధ, కె.నీరజ, ఎ.షీబారాణి, ఎస్ఎస్ పీఓబ్లూ పద్మజ, ఎల్.మహేశ్, వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వర్, పద్మజ, ఆంజనేయులు, ముక్తవాణి, మంజులత పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ముషీరాబాద్ నియోజకవర్గంలో గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నియోజకవర్గం కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. శనివారం గాంధీనగర్‌లో సమావేశం నిర్వహించి గణేశ్ ఉత్సవ సమితికి అన్నిడివిజన్ల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గాంధీ నగర్ డివిజన్ కన్వీనర్‌గా సాయికుమార్‌ను నియమించారు. గణేశ్ మండపాల నిర్వాహకులకు ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, 77998 19991 కు సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సమితి నియోజకవర్గం సభ్యులు పరిమల్ కుమార్, మహేందర్ బాబు, శక్తిసింగ్, కిరణ్ యాదవ్, ఆనంద్ రావు, అనిల్‌కుమార్, ఆయూష్, మారుతి, కుషాల్ గౌడ్, రాజేశ్ చారి, మహేశ్ పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

ఉన్నత లక్ష్యాలతో విద్యాభ్యాసం చేయాలి

విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో విద్యాభ్యాసం చేయాలని ట్రాఫిక్ డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మెహిదీపట్నంలోని సింధు మహిళా కళాశాలలో అభ్యుదయ పేరుతో ప్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు రామారావు, అధ్యక్షులు వెంకటాచలపతి, ప్రిన్సిపాల్స్ విజయ సంధ్యారాణి, కె.ప్రమీలారాణి, వైస్‌ప్రిన్సిపాల్ నాగేంద్రుడు పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

అంబర్‌పేట, ఆగస్టు 24 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జున నగర్‌లోని రోజ్‌బడ్స్ హైస్కూల్, రోజ్‌బడ్స్ ప్లేస్కూల్‌లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు రాధాకృష్ణుడి వేషధారణ, గొల్లభామగా అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్మాష్టమి వేడుకలకు ఏర్పాట్లు

అబిడ్స్ : మంగళ్‌హాట్ పూసలబస్తీలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆర్కిటెక్ ఇంజనీర్, కార్వాన్ మాజీ కార్పొరేటర్ ఆవుల అరుణ దంపతులు పేర్కొన్నారు. స్వర్గీయ పొదిల వెంకన్న, భూషమ్మ ఆశీస్సులతో వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న స్వామి వారికి అభిషేకం, భజన కీర్తనలు, శ్రీకృష్ణ డోలాహరణం, 27న సత్యనారాయణ స్వామి వ్రతం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం శ్రీకృష్ణ, యశోద, రాధ, గొల్ల భామల వేషధారణ పోటీలు, ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించే పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేయనున్నామని తెలిపారు.

ఏఎంఓహెచ్‌గా డాక్టర్ వెంకటరమణ

అబిడ్స్, ఆగస్టు 24 : జీహెచ్ఎంసీ పద్మాల్గవ సర్కిల్ ఏఎంఓహెచ్‌గా డాక్టర్ వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులు విధులల్లో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులు నిబంధనలను అతిక్రమించి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేస్తే జరిమానాలు తప్పవన్నారు. పరిసరాల పరిశుభ్రత కోసం ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రతి నిత్యం సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో తిరిగి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

చిక్కడపల్లి, ఆగస్టు 24 : గ్రేటర్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్, మ్యూచువల్లి ఎయిడెడ్ కో- ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, డైరెక్టర్లు రామారావు, ఉద్రసీన్ శనివారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ.. 15 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ఇండ్ల స్థలాలు సమస్యలను పరిస్కరిస్తూ, ఆ సొసైటీలోని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయం అన్నారు. అదే సమయంలో తమ సొసైటీకి కూడా స్థలం కేటాయించి అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న మామడి సోమయ్య. బొల్లం శ్రీనివాస్

మహిళా రాజకీయ రిజర్వేషన్ల బీసీ మహిళా కోటా ఇవ్వాలి

చిక్కడపల్లి, ఆగస్టు 24 : మహిళా రాజకీయ రిజర్వేషన్ల బీసీ మహిళా కోటా ఇవ్వాలని రచయిత దాసోజు లలిత డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఎరుక సాహిత్య సాంస్కృతిక సామాజిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన ' మహిళా రాజకీయ రిజర్వేషన్లు బీసీ మహిళా కోట ' అంశంపై రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా దాసోజు లలిత మాట్లాడుతూ.. 2029 జరుగబోయే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లను అమలు చేయబోతోందని అనీ అందులో బీసీ మహిళా కోటాను అమలు చేయాలన్నారు. ప్రముఖ సామాజిక ఉద్యమకారిని రజిత మాట్లాడారు. సమావేశంలో వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, వాసంతి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఉపాధ్యక్షురాలు వనజ, కృపాకార్ మాదిగ, కరంగిని దుర్గారాణి, జి.రేణుక, పావని, సోగర బేగం, లక్ష్మి, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన హనుమాన్ బాలాజీ మందిరం వార్షిక బ్రహ్మోత్సవాలు

శ్రీ హనుమాన్ బాలాజీ మందిరం వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. 19 నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ముగింపు రోజు పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు పి.సత్యంచారి, బ్రహ్మోత్సవ అధ్యక్షుడు గొరిగె శ్రీనివాస్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు సుదర్శనం, కార్యదర్శి బి.రమేశ్, సహాయ కార్యదర్శి డి. శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, బ్రహ్మోత్సవ కార్యదర్శి పవన్, రాంచందర్, కె.అశోక్, గొరిగె యాదయ్య పర్యవేక్షణలో కనుల పండుగగా నిర్వహించారు. 22న కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని, సాయంత్రం పల్లకి ఊరేగింపును పురవీధులలో భక్తుల జయ జయ ధ్వానాల మధ్య నిర్వహించినట్లు తెలిపారు. మధ్యాహ్నం, రాత్రి అన్న ప్రసాద పంపిణీ చేపట్టినట్లు వివరించారు. వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసేందుకు సహకరించిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

- అబిడ్స్

తాగునీటి సమస్యను పరిష్కరించండి

బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జున నగర్‌లో కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్ వాటర్‌వర్క్స్ అధికారులను కోరారు. శనివారం కలుషిత నీరు సరఫరా అవుతున్న బస్తీలో ఇంటింటికీ తిరిగి పరిశీలించారు. సమస్యను అధికారులకు చెప్పడం జరిగిందని, ఈ మధ్యనే కొత్త పైపులైన్ వేశారని తెలిపారు. సమస్య పునరావృతం కాకుండా వాటర్‌వర్క్స్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు శివకుమార్, అశోక్, లైన్‌మెన్ ప్రేమ్ పాల్గొన్నారు.

- అంబర్‌పేట

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ..

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని డీసీ నాగేశ్వర్ రావు, ఏఎంఓహెచ్ డాక్టర్ ఎజాజ్ ఖానీం అన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని, అలా వేస్తే రూ.1000 జరిమానా వేస్తామని హెచ్చరిస్తున్నారు. శనివారం నాంపల్లి నియోజకవర్గంలోని మల్లేపల్లి, ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం డివిజన్లలో జీహెచ్ఎంసీ అధికారులు చెత్త వేయకుండా ఉండటానికి పలు ప్రాంతాలను గుర్తించి అక్కడ ముగ్గులు వేసి అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీసీ ప్రజలకు పలు సూచనలు చేశారు.

- మెహిదీపట్నం

యువతి అదృశ్యం

కాచిగూడ, ఆగస్టు 24 : యువతి అదృశ్యమైన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై జి.సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చెప్పల్‌బజార్‌కు చెందిన రాములు కూతురు శ్రీజను తల్లి మందలించింది. దాంతో మనస్థాపంతో ఆమె శనివారం ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబస భ్యులు స్నేహితుల ఇండ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో తల్లి ప్రమీల కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంట్లోంచి వెళ్లే సమయంలో క్రీమ్‌టాప్, ఎరుపు లెగ్గిన్ ధరించి, ఎత్తు 5.0 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో వ్యవసాయదారుడు..

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో వ్యవసాయదారుడు అదృశ్యమైనాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్, నానూర్ మండలం, కొత్తపల్లికి చెందిన రావుజీ కుమారుడు రాథోడ్ దేవిదాస్ వ్యవసాయదారుడు. తిరుపతి నుంచి అకోలా రైల్లో కుటుంబసభ్యులతో కలిసి శనివారం కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఆదిలాబాద్‌కు వెళ్లడానికి టికెట్ తీసుకురావడానికి దేవిదాస్ కౌంటర్ వద్దకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కొడుకు తరుణ్ కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొడుకు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌రావు తెలిపారు.